బీఆర్ఎస్ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరు

కే శేఖర్‌రెడ్డి

మెహిదీపట్నం, ఏప్రిల్ 28 : తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని కార్వాన్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అడ్ హాక్ కమిటీ సభ్యులు కే .శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మెహిదీపట్నంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఎల్కతుర్తిలో రికార్డును సృష్టించిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా లక్షలాది మంది తరలివచ్చి సభలో పాల్గొనడం గతంలో ఏ పార్టీ సభలో జరగలేదన్నారు. పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రభంజనాన్ని రానున్న రోజుల్లో ఎవరు అడ్డుకోలేరని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకిలో 94 మందికి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. కార్పొరేటర్ ఎండి నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు వజీ ఉజ్జమ సిద్ధికి, అరుణ్ ఫర్హాన్ పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 28

రూ.2 కోట్ల వసూళ్లే లక్ష్యం

- రేపటితో ముగియనున్న గడువు
- పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్న అధికారులు

జీహెచ్ఎంసీ భవనం, అబిడ్స్

అబిడ్స్, ఏప్రిల్ 28 : జీహెచ్ఎంసీ ప్రవేశ పెట్టిన ఎర్లీ బర్డ్ పథకం ద్వారా ఆస్తి పన్నును ముందుగా వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఈ పథకం ద్వారా 15,199 ఆస్తులకు గాను ఇప్పటికే భారీగా ఆస్తి పన్ను వసూలు కాగా రెండు రోజులలో మరో రెండు కోట్ల రూపాయలను వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత సంవత్సరం ఎర్లీ బర్డ్ పథకం కింద పది కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా ఈ సంవత్సరం అంతకంటే అదనంగా ఆస్తి పన్ను వసూలు చేయాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకంలో భాగంగా ముందుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి జీహెచ్ఎంసీ ఐదు శాతం రిబేటును ఇస్తోంది. ఏప్రిల్ 30వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించే వారు ఐదు శాతం తగ్గించుకుని చెల్లించేందుకు గాను అధికారులు చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ ప్రవేశ పెట్టిన ఈ పథకంలో భాగంగా ఆస్తి పన్ను వసూలు చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. సెల్‌ఫోన్‌లకు ఎస్ఎంఎస్‌లు ఇవ్వడంతో పాటు బ్యానర్‌లను ఏర్పాటు చేయడం, ఇంటింటికి స్టిక్కర్‌లను అతికించడం ద్వారా అధికారులు చర్యలను ప్రారంభించారు. గడువు తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించని వారికి రెండు శాతం అపరాద రుసుమును విధిస్తున్న జీహెచ్ఎంసీ ముందుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి రిబేటు కల్పించేందుకు గాను ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. గత సంవత్సరాల కన్నా ఈ సంవత్సరం ఈ పథకానికి ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది.

రెండు రోజుల్లో వసూళ్లు పూర్తిచేసేలా చర్యలు..

మరో రెండు కోట్ల రూపాయలను రెండు రోజులలో వసూలు చేయాలనే కృత నిశ్చయంతో అధికారులున్నారు. మంగళ, బుధవారాల్లో విస్తృతంగా ప్రచారం చేసి ఆస్తి పన్ను వసూలు చేయాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ డీసీ దుబ్బాక లావణ్య నేతృత్వంలో అధికారులు, సిబ్బంది అసెస్‌మెంట్ హోల్డర్‌లకు ముందుగా చెల్లించడం వలన లభించే లాభాలను వివరించి వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

30న హోమియో వైద్య ఫెస్ట్ కార్యక్రమం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్యనిర్వాహక వర్గం ప్రతినిధులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 28 : డా.శామ్యూల్ హనిమన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక్క రోజు హోమియో ఫెస్ట్ ఈ కార్యక్రమం ఈ నెల 30న ఖైరతాబాద్‌లోని ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక వర్గం ప్రతినిధులు చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హోమియో ఫెస్ట్ కార్యనిర్వాహక వర్గం డా.కే.గోపాలకృష్ణ, డా.జి. దుర్గాప్రసాద్‌రావు, డా.వేణుగోపాల్‌గౌడ్, డా.మధు వారణాశి, డా.కె.యస్‌గుప్త, డా. యి.శశాంక్ మాట్లాడుతూ హోమియో వైద్య విద్యార్థుల్లో క్లినికల్ సామర్థ్యంతోపాటు, సృజనాత్మక పోటీ తత్వాన్ని అలవాటు చేయడమే ఈ హోమియోఫెస్ట్ యొక్క లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎరుకల కులస్తులను గుర్తించని ప్రభుత్వం

అభివాదం చేస్తున్న తెలంగాణ ఎరుకల ప్రజా సమితి అధ్యక్షుడు కెమసారం తిరుపతి

రవీంద్రభారతి, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో ఎరుకల కులస్తులను ప్రభుత్వం గుర్తించడం లేదని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి అధ్యక్షుడు కెమసారం తిరుపతి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సమితి అధ్యక్షుడు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 80 లక్షల జనాభా ఉన్న ఎరుకల కులస్థుల స్థితిగతులు అధ్వాన్నంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ జాతి అభివృద్ధికి రూ.100కోట్ల బడ్జెట్ కేటాయించి పేద ఎరుకల కులస్తులను ఆదుకోవాలన్నారు. మనుపాటి శ్రీనివాస్, తిరుపతి సంపత్, నడిగడ్డ కుమారస్వామి, రేవెల్లి తిరుపతి, కెమసారం రాజు, ఎల్లయ్య, నడిగడ్డ రాజు, జయశంకర్, శ్రీను, సార్ల తిరుపతి పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రపంచ భద్రతా దినోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తెలంగాణ చైర్మన్ బింది రాజ్‌గోపాల్‌రావు

రవీంద్రభారతి, ఏప్రిల్ 28 : ప్రతి కంపెనీ కూడ భద్రతా ప్రమాణాలు పాటించాలని, కొన్ని కంపెనీలు పాటించడంలేదని ఇది పద్ధతి కాదని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చైర్మన్ బింది రాజ్‌గోపాల్‌రావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రపంచ జాతీయ భద్రతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా విచ్చేసిన డైరెక్టర్ రాజగోపాల్‌రావు, వికాస్‌రావు, ఐఎఎస్, సంజయ్ చక్రువేది, పి.హేమాచంద్ర జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురికి అవార్డులు బహూకరించారు. రాజ్‌గోపాల్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్క కంపెనీ భద్రతా ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో ఆయా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇబ్రహీంబాగ్‌లో క్యాండిల్ ర్యాలీ

ఇబ్రహీంబాగ్‌లో బస్తీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పహల్‌గామ్ మృతులకు సంతాపం తెలియజేస్తూ క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మిర్జా రెహమత్ బేగ్ ఖాద్రి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినాయక దయానంద్, కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమ సిద్ధికి, నాయకులు ఖాజా మాతంగి రమేష్, పరమానందం, వీఎస్ రాజు, హనుమంతరావు పటేల్ సురేందర్ పటేల్,రాకేష్ పటేల్, వినాయక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 28

ఉగ్రదాడి పిరికిపంద చర్య

జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన దాడిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పల్ సూర్యనారాయణ గుప్త ఖండించారు. ఉగ్రదాడిని పిరికిపంద చర్య అని , ఒక వర్గాన్ని టార్గెట్ చేసి హతమార్చడం బాధాకరమన్నారు. ఉస్మాన్‌గంజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోడీ టెర్రరిస్టులను తుదిముట్టించాలని కోరారు.

– అబిడ్స్ , ఏప్రిల్ 28

బసవేశ్వర జయంతి ఉత్సవ కమిటీ సభ్యుడిగా ఉమామహేశ్వర్

కాచిగూడ, ఏప్రిల్, 28: రాష్ట్ర వీర శైవ లింగాయత్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు ఉమామహేశ్వర్ మహాత్మ బసవేశ్వర జయంతి ఉత్సవాల కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ నెల 30న రవీంద్రభారతిలో బసవేశ్వర జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్ర ఉత్సవ కమిటీ చైర్మన్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో కమిటీ సభ్యుడిగా ఉమామహేశ్వర్‌ను నియమించడం జరిగింది.

30 నుంచి కాపు సభ్యత్వ నమోదు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కాచిగూడ, ఏప్రిల్ 28 : తెలంగాణలోని మున్నూరుకాపులు ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ వరకు జీవితకాలం సభ్యత్వం నమోదు చేసుకోవాలని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.రమేష్ కుమార్, బి.జితేందర్, కె.వినోద్ కుమార్, ఏ. మాణిక్ ప్రభు, కె.సురేష్ బాబు, ఎం.రామేశ్వర రావు, ఎస్.శ్రీనివాస్ రావు, పి.దత్తు మూర్తి, ఐలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు

విద్యార్థులతో స్వర విద్యా మందిర్ డైరెక్టర్ సంజయ్ భరద్వాజ్

రవీంద్రభారతి, ఏప్రిల్ 28 : చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వర వాహిని విద్యామందిర్ విద్యార్థులు భక్తి పాటలతో సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర విద్యా మందిర్ డైరెక్టర్ సంజయ్ భరద్వాజ్, ప్రసన్నలక్ష్మీలు పాల్గొని భక్తి గీతాలను ఆలపించి మంత్రముగ్ధులను చేశారు. దేవాలయం అధ్యక్షుడు మల్లారపు లక్ష్మీనారాయణగౌడ్ సన్మానం చేశారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో కూచిపూడి నృత్యం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 28 : భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో సోమవారం గిన్నిస్ వరల్డ్ రికార్డుల పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇటీవల కూచిపూడి నృత్యాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 400 మంది గురువుల శిష్య బృందం 4218 మంది ఏకకాలంలో 15 నిమిషాల పాటు కూచిపూడి జనుత శబ్దం అంశాన్ని ప్రదర్శించిన సందర్భంగా ఈ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించగా సర్టిఫికెట్లను భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కే.వి రమణారావుకు, కార్యదర్శి లలితారావుకు అందజేశారు.

వంట కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలి

హిమాయత్‌నగర్,ఏప్రిల్ 28: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే వంట కార్మికులకు రూ.10వేల వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. ప్రేంపావని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ ఎన్ రెడ్డి భవన్‌లో యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా బకాయి ఉన్న వంట బిల్లులు, కోడి గుండ్ల బిల్లులు, వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా మే1న మేడే ఉత్సవాలు, మే 20న జరిగే సార్వ త్రిక సమ్మెలో వంట కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు యూనియన్ నేతలు కరుణ కుమారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ రైల్లో చోరీలు

కాచిగూడ, ఏప్రిల్ 28: కాచిగూడ వీక్లీ స్పెషల్ రైల్లో దొంగతనాలు జరిగాయి. రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం .. కూకట్‌పల్లిలోని బాలాజీ నగర్ కు చెందిన తలుకుల నాగమల్లిక(38) కాచిగూడ స్పెషల్ రైల్లో ఆదివారం వచ్చి కాచిగూడ రైల్వే స్టేషన్ లో దిగారు. అనంతరం బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 12 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో...

పంజాగుట్టకు చెందిన బి.వెంకటేశ్వర్లు (67)కాచిగూడ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా చిట్యాల రైల్వే స్టేషన్‌లో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 30 గ్రాముల బంగారు, 10 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.8 వేలు, ఏటీఎం కార్డు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

బైక్ నుంచి పడి గాయాలు

మెహిదీపట్నం, ఏప్రిల్ 28 : పోలీసులు తనిఖీలు చేస్తుండగా తప్పించుకోవడానికి వెళ్లి కింద పడి యువకుడికి గాయాలైన ఘటన హుమాయంనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అహ్మద్‌నగర్‌లోని ఫస్ట్ లాన్సర్లో శనివారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. కూకట్‌పల్లికి చెందిన సాజిద్‌ఖాన్ బైక్‌పై వెళ్తుండగా పోలీసుల నుంచి తప్పించుకొని వెళ్తుండడంతో పోలీసులు అతనిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ప్రమాదవశాత్తు వాహనంపై నుండి కింద పడడంతోగాయాలయ్యాయి. ఈ విషయంపై ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌కు సమాచారం ఇవ్వడం తో మరుసటి రోజు హాస్పిటల్ కి వచ్చి సాజిద్‌ను పరామర్శించారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌ను వివరణ కోరగా ప్రమాదవశాత్తు సాజిద్ కింద పడిపోయాడని చెప్పారు. యూట్యూబ్లో అసత్య ప్రచారం చేస్తున్నారని సీఐ స్పష్టం చేశారు.

రెండు కార్లు ఢీ..

బండ్లగూడ, ఏప్రిల్ 28: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పై రెండు కార్లు ఢీకొన్నాయి. మెహదీపట్నం నుంచి ఆరాంగర్ వైపు వెళ్తున్న ఓ కారు ముందు వెళ్తున్న మరో కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ వే ఫై ట్రాఫిక్ జామైంది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు బోల్తా కొట్టిన కారును అక్కడి నుంచి తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.

నటులకు పురస్కారాలు శక్తినిస్తాయి

నటుడు సాయికుమార్‌ను సన్మానిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, ఏప్రిల్ 28 : కళాదర్బార్ హైదరాబాద్ వార్షికోత్సవం రవీంద్రభారతిలోనిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు అధ్యక్షతన గోల్డెన్ జూబ్లీ పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీనటుడు బాబుమోహన్ మాట్లాడుతూ నటులకు పురస్కారాలు శక్తినిచ్చే టానిక్ లాంటివన్నారు. ఈ కార్యక్రంలో ప్రముఖ నటుడు సాయికుమార్, రాజీవ్ కనకాల, అలీ, రఘుబాబు,ప్రీతి నిగమ్, స్వాతి సోమనాథ్, ముప్పు హోమ్స్ చైర్మన్ వెంకయ్య చౌదరి,జి.హరిబాబు,నరేంద్రకుమార్ ,మాదాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,ఏప్రిల్ 28: అనుమతి లేకుండా విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న పాన్‌షాపు నిర్వాహకులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని సత్యాకాలనీలో షేక్ అబ్రార్(43) అనే వ్యక్తి గ్రీన్‌ల్యాండ్ పాన్ డిలైట్ పేరుతో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. షాపులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సిగరెట్లు అమ్ముతున్నారన్న ఫిర్యాదులతో దాడులు నిర్వహించిన ఫిలింనగర్ పోలీసులు వివిధ బ్రాండ్లకు చెందిన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. బేగంబజార్‌కు చెందిన రాజు అనే వ్యక్తి ఈ సిగరెట్లను తమకు సరఫరా చేస్తున్నాడని అబ్రార్ అంగీకరించాడు. దీంతో పాన్ షాపు నిర్వాహకుడు అబ్రార్‌తో పాటు రాజు అనే వ్యక్తి మీద ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నడిరోడ్డుపై గొడవ ఇరువర్గాలపై కేసు

బంజారాహిల్స్,ఏప్రిల్ 28: నడిరోడ్డుపై గొడవపడుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న రెండు వర్గాలపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. టోలీచౌకి సమీపంలోని ఎస్ఏ కాలనీలోని ప్రధాన రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్న ఫిలింనగర్ పోలీసులకు రెండు వర్గాలు గొడవపడుతున్న విషయాన్ని గుర్తించారు. గుంపులుగా చేర్చి బాహాబాహీకి దిగడంతో పాటు కార్ల అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గొడవకు దిగుతున్న షేక్ షోయబ్ (19), మహ్మద్ ఫైజల్ ఖాన్(27), అబ్దుల్ అజార్(24), సయ్యద్ అహ్మద్ (23), ఒమర్ ఎండీ సర్వర్(24), అబుకర్ బిన్ అఫ్సర్(24), అనస్ హుస్సేన్ (25) తదితరులపై బీఎన్ఎస్ 194 (2), 324(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

డివిజన్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ ఉమారమేష్ యాదవ్ అన్నారు. బర్కత్ పుర పార్క్ సమీపంలో గాలి దుమారానికి ఆదివారం రాత్రి చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. స్థానికుల ఫిర్యాదుతో కార్పొరేటర్ సంఘటన స్థలానికి వెళ్లి సంబంధిత అధికారులను పిలిపించి రోడ్డుపై పడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. కన్నె రమేష్ యాదవ్, ఎల్లక్ట్రికల్ ఏఈ బాలరాజ్, భీమ్ రాజ్, రవి యాదవ్, సంతోష్, పాల్గొన్నారు.

– కాచిగూడ, ఏప్రిల్ 28

PUBLIC NOTICE

The general public is hereby informed that my client Sri Nagari Laxman, S/o. Late Nagari Rama Swamy, R/o. Balaji Nagar, Rahimpura, Hyderabad is intending to purchase the entire RCC Residential House bearing No. 13-2-361/12, consisting of Ground Floor + 1st Floor, total admeasuring 214 Sq. yds. or 177.62 Sq. mts., situated at Bagh Mukadam Jung (Jali Hanuman, Dhoolpet), Rohimpura, Hyderabad from Sri Nagari Surya Prakash, S/o. Late N.Balaram, Aged about 66 years, Occ: Business, R/o. H.No. 5-8-47, Chirag Ali Lane, Hyderabad who acquired the said property from his brothers namely Sri Nagari Pandusa and Sri Nagari Radhakrishna vide the Gift Settlement Deed doct.No. 815/2010, Dated 11-03-2010. If any person(s) have any right, interest, claim, demands or objections over the said property may contact the under signed with all relevant documents within (7) days from the date of publication of this notice, failing which my client will enter into negotiations and purchase the said property and thereafter objections received, if any will not be entertained and deemed to have been waived.

KUNCHALA SRINIVAS, Advocate
Alkapuri X Road, Nagole, Hyderabad,
Cell: 9346641251.